అప్రమత్తతతోనే ఆనంద దీపావళి

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి



భీమడోలులో దుకాణాదారులకు సూచనలిస్తున్న సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌లు

భీమడోలు: ప్రతి ఇంటా ఆనందోత్సాహాల నడుమ నిర్వహించే పండుగ దీపావళి. ఈ పండుగ రోజున టపాసులు కాల్చే తరుణంలో సరైన జాగ్రత్తలు పాటించకపోకపోతే ప్రమాదాలు తప్పవు. టపాసులు కాల్చే తరుణంలో వచ్చే వెలుగు, వెలువడే వేడి, మంట వల్ల కళ్లకు తీవ్ర ప్రమాదం ఉంటుంది. బాణసంచాలో రసాయనాలతో కళ్లు దెబ్బతింటున్నాయి. సల్ఫర్, గన్‌ఫౌండర్ లాంటి రసాయనాల ప్రభావం వల్ల కళ్లు దెబ్బతింటున్నాయి.

జాగ్రత్తలు ఇలా..

- పేరున్న సంస్థలు తయారు చేసిన టాపాసులనే ఎంపిక చేసుకోవాలి.
- టపాసులు వెలించిన తర్వాత దూరంగా ఉండాలి. పేలని టాపాసులపై ఒంగి చూడడం వల్ల పెద్ద శబ్దంతో పేలితే ప్రమాదం సంభవిస్తుంది.
- కంటికి రక్షణగా ప్లైయిన్ అద్దాలు వాడడం మంచిది. ప్రమాదవశాత్తు కంటికి ఏదైనా గాయమైతే సమీపంలోని కంటి వైద్యుడిని సంప్రదించాలి. మాస్కులు ధరించారు.
- బాణసంచాను కిచెన్, పొయ్యి ఉన్న ప్రాంతాల్లో ఉంచరాదు.
- బాణసంచా కాల్చేటప్పుడు బిగుతుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలి. రెండు బకెట్లలో నీరు సిద్ధంగా ఉంచుకోవాలి.
- కాలిన గాయాలను రుద్దకూడదు. గాయంపై మంట తగ్గే వరకు నీటిని పోయాలి.
- చేతి వేళ్లు తీవ్రంగా కాలితే వేళ్లు అతుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. అందుకు వాటి మధ్య తడిగుడ్డ ఉంచుకోవాలి.
- మరింత శబ్దం కోసం కుండలు, రేకు డబ్బాలు, గాజు వస్తువుల్లో బాణసంచా ఉంచి కాల్చకూడదు. అని పేలినప్పుడు వేగంగా విస్తరించే పెంకుల వల్ల చర్మ, కళ్లు, ఇతర అవయవాలు గాయపడే ప్రమాదం ఉంది.
- చిన్న పిల్లలను ఎత్తుకుని బాణాసంచా కాల్చరాదు. పెద్ద వాళ్ల సహాయం లేకుండా పిల్లలు వాళ్లంతట వాళ్లే కాల్చడం సరికాదు. పిల్లలు కాల్చేతరుణంలో పెద్దలు పక్కనే ఉండి వారిని గమనించాలి.
- అప్పడే పుట్టిన చిన్నారులు, పిల్లలు, గర్భిణులు, వృద్ధులపై బాణాసంచా శబ్దాలు ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. ప్రధానంగా చెవులు దెబ్బతింటాయి. కొన్ని టపాసుల శబ్దం 100 నుంచి 120 డెసిటల్స్‌తో వరకు ఉంటుంది. సాధారణంగా చెవి డెసిబెల్స్ శబ్దాన్ని హాయిగా వినగలుగుతుంది. ఆపై పెరిగే శబ్దం చెవికి ఇబ్బంది పెడుతుంది. ఈ తరుణంలతో చెవులకు ఇయర్ ప్లగ్స్ పెడితే కొంత వరకు ఉపయోగపడుతుంది. పూలలాంటి వెలుగులు కురిపించే చిచ్చుబడ్లు, కాకర వత్తులు, పెన్సిళ్లు, భూచక్రాలు వంటివి కాల్చడం మంచిది.

పాదరక్షలు వేసుకోవాలి



చిన్నపిల్లకు పాదరక్షలు లేకుండా బయటకు రానివ్వద్దు. నిప్పు రవ్వలు తొక్కే ప్రమాదం ఉంది. రద్దీగా ఉండే ప్రదేశాల్లో, ఇరుకైన దారుల్లో, ఇంటి లోపల మందుగొండు సామగ్రి కాల్చవద్దు. ప్రమాదం జరిగిన 15 నిమిషాల్లోపు కాలిన గాయంపై చల్లటి నీటిలో ఉంచాలి. పెద్ద గాయాలు ఏర్పడిన తరుణంలో విధిగా దుప్పటితో గాని రగ్గుతో కప్పాలి. సమీపంలోని ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలి.

– ఇ.కల్యాణి మహేశ్వరి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, పూళ్ల

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



దీపావళిని ప్రతి ఇంటా ఆనందంగా జరుపుకోవాలి. అనుమతులు పొందిన లైసెన్స్‌దారులు, వివిధ శాఖల అధికారులు నిర్దేశించిన దూరంగా ఉన్న ప్రదేశాల్లోనే అమ్మకాలు చేయాలి. అక్కడ డ్రమ్ములు, నీరు, ఇసుకతో పాటు భద్రత పరికరాలను అందుబాటులో ఉంచాలి. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. 200 లీటర్ల కెపాసిటీ గల రెండు డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని అందులో నీటితో నింపుకోవాలి. దుకాణాలు ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.

– వై.సుధాకర్, ఎస్సై, భీమడోలు

క్లుప్తంగా

ఖాతాదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యత



కెనరా బ్యాంక్ సత్రంపాడు శాఖను ప్రారంభిస్తున్న సర్కిల్ హెడ్ విజయలక్ష్మి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఖతాదారుల ప్రయోజనాలకు కెనరా బ్యాంక్ తొలిప్రాధాన్యత ఇస్తుందని కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్ సీజీ విజయలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక సత్రంపాడులో కెనరా బ్యాంక్ నూతన శాఖను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారుల ప్రయోజనార్థం బ్యాంక్ విశిష్ట సేవలు అందిస్తోందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీజనల్ హెడ్ తోట రవిచంద్ర మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మరిన్ని శాఖలను ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. తక్కువ సమయంలో ఉన్నతమైన సేవలను అందించాలనే ప్రణాళికతో డిజిటల్, సాంకేతిక సేవలను పెంచుతున్నామని వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీ దివ్య గాయత్రి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని స్థాపిద్దాం



కురెళ్లగూడెంలో ప్రతిజ్ఞ చేస్తున్న మేనేజర్ అనిల్ కాంత్, అధ్యక్షుడు మాన్‌సింగ్

భీమడోలు: అవినీతి రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాబార్డ్ మేనేజర్ అనిల్ కాంత్ అన్నారు. కురెళ్లగూడెం గ్రామంలో బుధవారం నాబార్డ్, చైతన్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. లంచం తీసుకోవడం, ఇవ్వడం నేరమని అనిల్ కాంత్ అన్నారు. ప్రజలంతా అవినీతిని సమష్టిగా ఎదుర్కొనేందుకు కంకణ బద్దులు కావాలని సూచించారు. అవినీతిని నిర్మూలించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల ఉద్యోగులు, ప్రజలంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి గౌతమి, పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారం వెలవెల



నారయణపురంలో వెలవెలబోతున్న బాణసంచా దుకాణాలు

ఉంగుటూరు: వర్షం కారణంగా కొనుగోలుదారులు రాక బాణసంచా దుకాణాలు వెలవెలబోయాయి. బుధవారం ఉంగుటూరు మండలంలో భారీ వర్షం కురిసింది. ఓ వైపు నిత్యావసర సరుకులు, మరో వైపు బాణసంచా ధరలు పెరిగిపోవడంతో టపాసులు కొనేందుకు ప్రజలు ఆలోచించాల్సి వచ్చింది.

చట్టాలపై అవగాహన అవసరం

దెందులూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని తహసీల్దార్ బి సుమతి అన్నారు. బుధవారం గోపన్నపాలెం సచివాలయంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరు సమాజంలో బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. స్వేచ్ఛ సమానత్వం ప్రతి ఒక్కరి సొంతమన్నారు. టీడీపీ నేత మిల్లు బాబు, డీటీ కృష్ణస్వామి తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని కల్లాల్లోనే కొనాలి



జేడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : రైతులు, కౌలు రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లోనే క్వాలిటీ నిర్ధారణ చేసి మిల్లర్లకు తరలించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన్ని కలిసి వినతి పత్రం అందజేశారు. కౌలు రైతులకు, రైతులతో సంబంధం లేకుండా కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇప్పించాలని, కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకొనేందుకు టార్పాలిన్లు వ్యవసాయ శాఖ సరఫరా చేయాలన్నారు. జేడీని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు గన్ను వెంకట్రావు, కార్యదర్శి దొంత కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రైతు సంఘం జిల్లా నాయకులు వరప్రసాద్ ఉన్నారు.

పాఠశాలలో దీపావళి సంబరాలు



పాఠశాలలో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

దెందులూరు: సీతంపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం జి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దీపావళి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు మతాబులు, భూచక్రాలు, విష్ణు చక్రాలు, టపాసులు, చిచ్చుబుడ్డిలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు తోట ఎడ్వర్డ్, తులసి జ్యోతిలక్ష్మి విద్యార్థులకు స్వీట్లు అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు పరామర్శ

పెదపాడు : మండలంలోని సత్యవోలు గ్రామంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులను జెడ్పీ వైస్ ఛైర్మన్ విజయబాబుతో పాటు పలువురు జెడ్పీటీసీలు బుధవారం పరామర్శించారు. పద్మశ్రీ భర్త ప్రసాదరావు తండ్రి రంగారావు ఇటీవల మరణించడంతో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వీరిలో జెడ్పీటీసీలు పెద్దిరాజు, కొయ్య సూర్యారావు, రాధాకృష్ణ, బాపూజీ, అంజిబాబు, సురేష్, వడ్డి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ముంగర సంజీవకుమార్ తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు : విద్యార్థులు సీనియర్ జూనియర్లనే తేడా లేకుండా కలిసి మెలిసి వ్యాయామ విద్యను అభ్యసించాలని ర్యాగింగ్ భూతం జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తహసీల్దార్ బి.సుమతి సూచించారు. బుధవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ కళాశాలలో పూర్తిస్థాయిలో విద్యను అభ్యసించాలని సూచించారు. గోపన్నపాలెం మాజీ సర్పంచ్ మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) మాట్లాడుతూ ఎంచుకున్న లకోష్యలను సాధించాలన్నారు. తొలుత సీనియర్ జూనియర్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. టీడీపీ నేత చింతా సుబ్బారావు, ఉపాధ్యాయులు దిలీప్, డి.రత్న బాబు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం





గుండుగొలను ఎస్సీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు, గుండుగొలనులో ఇళ్ల వద్ద నిలిచిన నీరు

భీమడోలు: కుండపోత వర్షం కారణంగా బుధవారం పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లలో సిల్టు పూడుకుపోవడంతో నీరంతా రోడ్డుపై పొంగి ప్రవహిస్తుంది. గుండుగొలను, పూళ్ల, భీమడోలు తదితర గ్రామాల్లో మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. బాణసంచా దుకాణాలు తడిసి ముద్దయ్యాయి. మరమ్మతులు చేపట్టని ప్రధాన రహదారు గోతుల్లో వర్షం నీరు చేరింది. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గుండుగొలను ఎస్సీ కాలనీలో పలు రోడ్లపై అడుగులోతు నీరు ప్రవహించింది. కాలనీలో ఒక రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఆ రోడ్డులోని ఓ వ్యక్తి డ్రెయిన్ పూడ్చేశారు. ఇదే పనిగా రైతుల కూడా తమ వైపు డ్రెయిన్ పూడ్చేసారు. దీంతో రోడ్డుపైకి నీరు ఎగదన్నింది. కాలనీ వాసులు మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అండర్‌పాస్‌లో వర్షం నీరు



దెందులూరు నుంచి అలుగులగూడెం వెళ్లే రైల్వే గేట్ వద్ద నిర్మించిన అండర్‌పాస్‌లో వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు అండర్‌పాస్‌ను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

– దెందులూరు

ర్యాగింగ్‌తో విద్యార్థుల భవిష్యత్‌కు దెబ్బ



డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సీఆర్‌ఆర్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ర్యాగింగ్‌తో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఎంబీఏ, సీఐఐఈ, ఈడీసీ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ సీనియర్లు జూనియర్ విద్యార్థులపై పెత్తనం సాధించడానికి ఉపయోగిస్తోన్న ర్యాగింగ్ వల్ల భవిష్యత్ దెబ్బతింటుందని హెచ్చరించారు. మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, బెట్టింగ్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. విద్యార్థులు ఎలా ప్రవర్తించాలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ సుబ్బారావులను సీఆర్‌ఆర్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కేపీ రామ రాజు, డైరెక్టర్లు వీఆర్ఎస్ బాబు యలమర్తి, రంగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నచ్చిన మిల్లుకు ధాన్యం తోలుకోవచ్చు



గోపాలపురంలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ఉంగుటూరు: నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని రైతులు తోలుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. బుధవారం పొలంబడి కార్యక్రమం యర్రమల్లిపాడు, గోపాలపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయంలో తూటి కాడ కషాయం తయారీ, వినియోగాన్ని వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఎన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. పశువులకు టీకాలు, మినీ గోకులం షెడ్లు దరఖాస్తులను ఇప్పటికే స్వీకరించినట్లు చెప్పారు. విద్యుత్, హార్టీకల్చర్ అధికారులు తమ శాఖల ద్వారా రైతులకు కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో భీమడోలు ఏడీఏ ఉషారాజకుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పంటల బీమా రైతుల చెల్లించాలి

పెదపాడు : రైతులు తప్పనిసరిగా వ్యవసాయ పంటలకు బీమా రైతులే చెల్లించుకోవాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని వేంపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పంటలు ప్రారంభానికి ముందు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. రైతులకు తమ పంటల దిగుబడి పెంచేందుకు తగు సూచనలు, సలహాలు పాటించాలని అన్నారు. మొక్కజొన్న ఉత్పత్తికి సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన, పసుసంవర్థక, ప్రకృతి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కేఎన్‌పురం నాయకుల ఉద్యమానికి మద్దతు



పోకల రాంబాబు

దెందులూరు : విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన పేరును తొలగించడంపై కండ్రిగ నరసింహపురం అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకులు చేస్తోన్న పోరాటానికి కాపు సంఘం తరపున కాపు సంఘం దెందులూరు నియోజకవర్గం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు మద్దతు తెలిపారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గత నెలలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తొలగించారని ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పుడు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ పేరుని తొలగించడం క్షమించరాని విషయమని తెలిపారు. భవిష్యత్తులో అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడ నుంచి తరలిస్తారనే అనుమానం వ్యక్తమవుతోందని, ఈ ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ ఆశయాన్ని అందరికీ ఆదర్శంగా ఉండేలా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 125 అడుగుల ఎత్తు గల అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తే జీర్ణించుకోలేకపోవడం దుర్మార్గమని వివరించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడ నుంచి తరలిస్తే సహించేదని స్పష్టం చేశారు.

తేమ శాతం నిబంధనలను సడలించాలి



వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందిస్తున్న కృష్ణారావు

ఉంగుటూరు : తేమ శాతం నిబంధనలను సడలించి రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ వెజు శ్రీరామచంద్రమూర్తి కోరారు. బుధవారం కైకరంలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హజరైన మండల వ్యవసాయ అధికారికి వారు వినతి పత్రం అందజేశారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టేందుకు అవకాశం లేక రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తూకాల్లో మోసాల్లేకుండా చూడాలని కోరారు.

ఆక్రమణలను తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్

ఉంగుటూరు: గోదవరి కాలువ గట్లపై ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు గ్రామాల వారీ జాబితా తయారు చేయడం, అందులో నివాసితులు ఉంటే వారికి పునరావాసం కల్పించి ఆక్రమణలు తొలగించాలని సూచించారు. డీఎల్‌పీఓ సూర్యకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆక్రమణదారుల జాబితాలు తయారు చేయాలని, వారి విద్యుత్ సర్వీసులు తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఏఈ శ్రీరామ్, వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కైకరం పంచాయతీలో అవినీతిపై విచారణ

ఉంగుటూరు : కైకరం పంచాయతీలో కార్యదర్శిగా పనిచేసిన కె.నాగేంద్ర నకిలీ రసీదులు సృష్టించి రూ.లక్షలు స్వాహా చేసిన విషయంలో సర్పంచ్ సలగలగోపి తీవ్ర అవినీతికి పాల్పడ్డారని గంజి ప్రభాకరరావు అనే వ్యక్తి ప్రజాసమస్యలు పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అప్పటి కార్యదర్శి అధికారులను విచారణ చేయకుండానే ఆఫైలు ముగించారు. ఈ విషయంపై తిరిగి గంజి ప్రభాకరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆఫైలును తిరిగి ఓపెన్ చేశారు. బుధవారం విచారణ చేపట్టారు. అధికారులు ఫిర్యాదుదారు గంజి ప్రభాకరరావును పిలిచి విచారించారు.

దీపావళికి 'ధరా'ఘాతం

ఏలూరు (టూటౌన్): పెరిగిన ధరలతో నిత్యావసర వస్తువులు కొనలేని ప్రజలు దీపావళి టపాసులుకొని ఏ విధంగా పండుగ చేసుకుంటారని బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం దీపావళి, సంక్రాంతి తదితర పండుగల సందర్భంగా పౌర సరఫరా శాఖ ద్వారా బెల్లం, మంచి నూనె, గోధుమ పిండి, శనగలు, పంచదార తదితర వస్తువుల్ని చౌకగా, ఉచితంగా ప్రజలకు ఇచ్చేదని గుర్తుచేశారు. నేడా పరిస్థితి లేకపోగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆకాశాన్ని తాకుతోన్న పప్పులు, మంచి నూనె ఇతర నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలతో దీపావళి పండుగకు ప్రజలను దూరం చేసిన ప్రభుత్వ వైఖరిని ఆయన ఖండించారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో అధికారులకు వస్తే పెరిగిన ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చి ధరలు మరింత పెరిగేందుకు ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని వెంకటేశ్వరరావు విమర్శించారు.

యూటీఎఫ్ ఏలూరు నగర శాఖ కార్యవర్గం ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక యూటీఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏలూరు నగర శాఖ స్వర్ణోత్సవ మహాసభ నగర శాఖ అధ్యక్షురాలు షేక్ పర్వీన్ బేగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం చిట్టిబాబు, అధ్యక్షుడిగా షేక్ పర్వీన్ బేగం, ఉపాధ్యాక్షుడిగా డి.దొరబాబు, పి.వాణి ప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా రాజారావు జొన్నకూటి, కోశాధికారిగా కోరాడ కిరణ్ కుమార్ ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రవి కుమార్ హాజరయ్యారు. జిల్లా కోశాధికారి రంగమోహన్, జిల్లా ఆడిట్ కన్వీనర్ బంటు మోహన్ రావు, జిల్లా కార్యదర్శి ఈడే శివ శంకర్‌రావు హాజరయ్యారు. ఎన్నికల అధికారి బంటు మోహన్ రావు, పరిశీలికలు ఈడే శివశంకరరావు సమక్షంలో నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు.